ప్రజాశక్తి

ఆదివారం 15 డిసెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం | అనకాపల్లి

అత్యధికం ఏకగ్రీవం

◆ సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం

◆ టిడిపి మద్దతుదారులదే హవా

◆ జనసేన, బిజెపికిలేని ప్రాధాన్యత

ఎస్.రాయవరంలో ఎన్నికైన వారిని అభినందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో భారీ, మధ్య, చిన్న తరహా ప్రాజెక్టుల పరిధిలోని 300 నీటి వినియోగదారుల సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికల్లో అగ్రభాగం ఏకగ్రీవమయ్యాయి. 300 నీటి వినియోగదారుల సంఘాల పరిధిలోని 2060 ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులకుగానూ 1960 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అత్యధిక మంది టిడిపి మద్దతుదారులే ప్రాదేశిక సభ్యులుగా ఎన్నికయ్యారు. కూటమిలో జనసేన, బిజెపి మద్దతుదారులు కొన్ని చోట్ల పోటీ చేయాలని భావించినా స్థానికంగా టిడిపి శ్రేణులు అందుకు అంగీకరించలేదు. దీంతో కూటమిలోని జనసేన, బిజెపి కార్యకర్తలు చేసింది లేక మిన్నకున్నారు. ఆయకట్టుదారుల్లో ఎక్కువ మంది టిడిపికి చెందిన వారుకావడంతో ఆ పార్టీలకు పెద్ద ప్రాధాన్యత ఇవ్వలేదు. నీటి సంఘాల ఎన్నికలు ప్రకటించినప్పటి నుంచి టిడిపి కసరత్తు చేసింది. ఆయకట్టుదారుల్లో పలుకుబడి కలిగిన వారిని పోటీలో పెట్టింది. ఈ ఎన్నికలను వైసిపి పెద్దగా పట్టించుకోకపోవడంతో మెజార్టీ స్థానాల్లో టిడిపి మద్దతుదారులే ఎన్నికయ్యారు. 75 ప్రాదేశిక సభ్యుల ఫలితాలు ప్రకటించాల్సివుంది. ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లో కొన్ని చోట్ల స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి.

భారీ నీటిపారుదల ప్రాజెక్టు (తాండవ) కింద 16 నీటి వినియోగదారుల సంఘాల పరిధిలోని 192 ప్రాదేశిక నియోజకవర్గాలకు 191 ఏకగ్రీవమయ్యాయి. ఒక ఫలితం తెలియాల్సివుంది. మధ్య తరహా ప్రాజెక్టులు రైవాడ, కోనాం, పెద్దేరు కింద 28 నీటి వినియోగదారుల సంఘాల పరిధిలోని 332 ప్రాదేశిక నియోజకవర్గాల్లో 314 ఏకగ్రీవంకాగా, తొమ్మిదింటికి ఎన్నిక జరిగింది. మరో తొమ్మిది ఫలితాలు రావాల్సివుంది. చిన్న తరహా నీటి వనరుల కింద 256 నీటి వినియోగదారుల సంఘాల పరిధిలోని 1536 ప్రాదేశిక నియోజకవర్గాల్లో 1455 ఏకగ్రీవమయ్యాయి. 16 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మరో 65 స్థానాల్లో స్వల్ప ఘర్షణలతో కొన్ని స్థానాల ఎన్నికలు వాయిదాపడగా, మరికొన్ని స్థానాల ఫలితాలు వెలువడాల్సివుంది.

సామాజిక బాధ్యత ఏదీ ?

◆ రూ.కోట్ల రాయితీలు పొందుతున్న పరిశ్రమాధిపతులు

◆ సిఎస్ఆర్ కింద నిధులు ఇవ్వడానికి మీనమేషాలు

◆ జోక్యం చేసుకోని జిల్లా స్థాయి కమిటీ ◆ పర్యవేక్షణ నామమాత్రం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

తక్కువ ధరకు భూములు, వివిధ రూపాల్లో రూ.కోట్ల విలువైన పన్ను రాయితీలు, మినహాయింపులు, ప్రోత్సాహకాలు పొందుతూ లాభాలు ఆర్జిస్తున్న పరిశ్రమలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద నిధులు కేటాయించడానికి మీనమేషాలు లెక్కిస్తున్నాయి. ఆ నిధుల వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన, కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్న జిల్లా స్థాయి కమిటీ చురుగ్గా పనిచేయడం లేదు. దీంతో పరిశ్రమలు ఇష్టాఇష్టాలు, ప్రయోజనాలు ఆధారంగా నిధులిస్తున్నాయి తప్ప నిబంధనల ప్రకారం కేటాయించడంలేదు. పరిశ్రమ ప్రభావిత, పరిసర ప్రాంతాల్లో తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు కేటాయింపు కంటే ప్రజా ప్రతినిధుల నుంచి సమస్యలు రాకుండా వారికి ఆర్థిక లబ్ధి కలిగించి, మెప్పుపొందే పనులకు పరిశ్రమాధిపతులు సిఎస్ఆర్ నిధులు కేటాయించి చేతులు దులుపుకుంటున్నారు. ఇది స్థానిక ప్రజాప్రతినిధులకు ఆదాయ వనరుగా మారింది. జిల్లా స్థాయి కమిటీ చురుగ్గా వ్యవహరించకపోవడంతో సిఎస్ఆర్ నిధుల కేటాయింపును తమ బాధ్యతగా పరిశ్రమాధిపతులు భావించడంలేదు.

సిఎస్ఆర్ కింద కేటాయించాల్సిన నిధులు, కేటాయిస్తున్న నిధులు సమాచారం కూడా ఈ కమిటీ వద్ద సరిగా లేదు. సిఎస్ఆర్ నిబంధనల ప్రకారం మూడేళ్లను పరిగణనలోకి తీసుకొని సగటు నికర ఆదాయంలో రెండు శాతం నిధులు పరిశ్రమాధిపతులు కేటాయించాల్సివుంది. రూ.500 కోట్ల నికర విలువ, లేదా వెయ్యి కోట్ల టర్నోవర్, లేదా ఐదు కోట్ల నికర లాభం కలిగిన పరిశ్రమలన్నీ సిఎస్ఆర్ కింద నిధులు కేటాయించాల్సివుంది. అయితే సిఎస్ఆర్ పరిధిలోకి వచ్చే పరిశ్రమల జాబితాయే కమిటీ మిగతా 2లో..

రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటుచేసుకోవాలి

▶ వార్త 3లో..

విద్యుత్ భారాలపై నిరసనల హోరు

▶ వార్త 4లో..

విద్యార్థులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

▶ వార్త 8లో..

నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు మోడీకి లేదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు ప్రధాని మోడీకి లేదని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 1356వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు, కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ చరిత్రను తెలియజేశారు. కేవలం రూ.4 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పడిన ప్లాంట్ దినదినాభివృద్ధి చెందుతూ వచ్చిందన్నారు. పన్నులు, డివిడెండ్ల రూపంలో రూ.50 వేల కోట్లను మిగతా 2లో..

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశ అత్యున్నత న్యాయ స్థానం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ల ద్వారా బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని, ఇలాంటి వేదికలను కక్షిదారులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి, నాలుగో అదనపు సెషన్స్ జడ్జి ఎం.నాగేశ్వరరావు అన్నారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకుగాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిత్యం పని చేస్తోందని గుర్తు చేశారు. జాతీయ లోక్ అదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానిక కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్ వద్ద శనివారం ఉదయం జరిగింది. జిల్లా కోర్టు ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలన్నదే న్యాయ వ్యవస్థ అంతిమ లక్ష్యమని, ఆ దిశగా న్యాయమూర్తులు సేవలందిస్తున్నారని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బాధితులకు అండగా నిలుస్తూ న్యాయ సహాయం అందిస్తోందని గుర్తు చేశారు. లోక్ అదాలత్ లాంటి వేదికల్లో పౌర శిక్షాస్మృతి, నేర శిక్షాస్మృతి పరిధిలోని రాజీకాగలిగిన కేసులు, మోటారు ప్రమాదాల కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు పరిష్కారానికి వస్తాయన్నారు. ప్రభుత్వ సంస్థలు, బీమా కంపెనీలు, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు, కక్షిదారులు ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా హితవు పలికారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవి.శేషమ్మ, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ జి.వల్లభ నాయుడు, ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.రాధారత్నం, బార్ అసోసియేషన్ కార్యదర్శి మిగతా 2లో..

మాట్లాడుతున్న జడ్జి నాగేశ్వరరావు

మొదటి పేజీ తరువాయి..

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

డి.నరేష్ కుమార్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లి : జిల్లా కోర్టులో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నపాటి తగువులతో బంధువులు కోర్టులకు ఎక్కి ఆర్థికంగా ఇబ్బంది పడే సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ప్రధానంగా ఆస్తుల విషయంలో కోర్టు మెట్లెక్కి కాలాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. అలాంటివారు సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ను ఆశ్రయిస్తే సమస్యను సులువుగా పరిష్కరించుకోవచ్చని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, అధ్యక్షులు ఎంజెవివిఎస్.కుమార్, కార్యదర్శి దుర్గారావు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో కక్షిదారులు హాజరయ్యారు.

సామాజిక బాధ్యత ఏదీ ?

వద్ద లేకపోవడంతో బతిమలాడి సిఎస్‌ఆర్ నిధులను రాబట్టి కొన్ని పనులు చేపడుతున్న దుస్థితి కొనసాగుతోంది. స్థానికులు కొందరి నుంచి సమస్యలు రాకుండా కొన్ని పరిశ్రమలు ఆయకట్టులేని చెరువు పనులకు లక్షల రూపాయలు కేటాయించడంతో నిధులు దుర్వినియోగమవుతున్నాయి. కొన్ని సాంకేతిక కారణాలను ఉపయోగించుకొని పరిశ్రమాధిపతులు కలెక్టర్ దృష్టిలో పెట్టకుండా సిఎస్‌ఆర్ నిధులు కేటాయించడం, ఖర్చు చేయడం జరుగుతోంది. జిల్లాలో 44,935 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేసిన 128 భారీ పరిశ్రమలు, రూ.2,482 కోట్ల విలువైన 18,640 మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఇ) యూనిట్లు వున్నాయి. మొత్తం పరిశ్రమల్లో వివిధ సందర్భాల్లో కొన్ని పరిశ్రమలు కాదనలేక ఈ రెండున్నరేళ్లలో రూ.3.14 కోట్లును వివిధ పనుల నిమిత్తం కేటాయించాయి. ఆ నిధులను పరిశ్రమాధిపతులు తమ దయాదాక్షిణ్యాలపై ఇచ్చినట్లు జిల్లా స్థాయి కమిటీ తెగ సంబరపడుతోంది తప్ప వారి నుంచి నిబంధనల ప్రకారం నిధులు కేటాయించే పనిని సమర్థవంతంగా చేయడంలేదు. కొంతమంది పరిశ్రమాధిపతులు ప్రభుత్వ స్థాయిలో తమ పనులు చేయించుకునేందుకు సిఎం రిలీఫ్ ఫండ్‌కు నిధులు కేటాయించి జిల్లాను విస్మరిస్తున్నారు. సిఎస్‌ఆర్ నిధులు జిల్లాకు ఎక్కువ కేటాయింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని అక్టోబర్ 28న కలెక్టరేట్‌లో రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర నిర్వహించిన సమీక్షా సమావేశంలో కొంతమంది ఎమ్మెల్యేలు వాపోయినా ఫలితం కానరాలేదు.

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు మోడీకి లేదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించిందన్నారు. ఉక్కు పరిశ్రమ త్యాగాలతో ఏర్పడిందని, ప్రజల ఆస్తి అని తెలిపారు. దాన్ని అమ్మే హక్కు కేంద్రానికి లేదన్నారు. తక్షణమే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ వల్లే విశాఖ నగరం ఇంతలా అభివృద్ధి చెందిందన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, హాస్పిటల్స్ యూనియన్ నాయకులు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

డబ్బు సంపాదనకే మంత్రి పదవిని వాడుకున్నారు

- ముత్తంశెట్టిపై వైసిపి నాయకులు ఆల్ఫా కృష్ణ విమర్శ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పదవీ వ్యామోహంతో 2019లో వైసిపిలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేరి పార్టీ తరుపున ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారని, కీలకమైన పదవులను పొందిన ఆయన భీమిలి నియోజకవర్గం అభివృద్ధికిగానీ, టూరిజం శాఖ మంత్రిగా విశాఖ జిల్లాలో టూరిజం అభివృద్ధికిగానీ ఏమాత్రమూ దోహదపడలేదని, ఆ కాలంలో డబ్బు దోచుకోవడానికే ఎక్కువ సమయం వెచ్చించారని వైసిపి సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బిఎస్.కృష్ణ (ఆల్ఫా కృష్ణ) ఆరోపించారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు ఇస్తున్నారని, వాటిని దిగువ స్థాయిలో తాము అమలు చేయాలా ? అని ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డి అక్కడ కాకుండా ముత్తంశెట్టి నివసిస్తున్న సీతమ్మధారకు లేదా మంత్రిగా పనిచేసిన భీమిలికి వచ్చి ఆదేశాలు ఇవ్వాలా ? అని ప్రశ్నించారు.

ముచ్చటగా మూడు పార్టీలు మారిన ముత్తంశెట్టి ఇప్పుడు మరోసారి వేరే పార్టీలోకి వెళ్లాలని చూస్తున్నారని, అయితే అటువంటి ఊసరవెల్లి నాయకుడిని ఏ పార్టీ వారూ చేర్చుకోకూడదని అన్నారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు మహిళల పట్ల వ్యవహరించిన తీరుపై అనేక ఆరోపణలు వచ్చాయన్నారు.

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.No.514/2024
O.S.No.58/2018

పిటీషనర్ : సజ్జా వెంకటేశ్వరరావు
And
రెస్పాండెంట్ : కొలుపాటి పట్టాభిరామయ్య వగైరా
4వ రెస్పాండెంట్ : కొలుపాటి శిరీష, W/o.రాంబాబు, R/o.MIG 106/బి, హౌసింగ్ బోర్డు కాలనీ, సుజాత నగర్, కమ్యూనిటీ హాల్ వద్ద, పెందుర్తి, పెందుర్తి మండలం, విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు దావా నందు మీ యొక్క హాజరు నిమిత్తము సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్ట్ ద్వారాను పంపించినను వాటిని మీరు అందుకొని వుండుట లేదు. అందువలన మీరు ది.**23-12-2024** సం.రం తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

కె.వి.రమేష్, అడ్వకేట్,
భీమవరం పిటీషనరు తరపు న్యాయవాది,
తేది. 14-12-2024 భీమవరం.

వ్యాపార రాజకీయాలు !

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అవునన్నా, కాదన్నా ప్రధాన పార్టీల నాయకులకు రాజకీయాలు వ్యాపార విస్తృతికి సాధనాలుగా వున్నాయి. రాజకీయ వ్యాపారం చేసేవారిని, వ్యాపారం కోసం రాజకీయాలు చేసేవారిని ఎన్నికల్లో ప్రజలు దూరం పెట్టనంతకాలం, పక్కకు నెట్టనంతకాలం, ఇంకా చెప్పాలంటే బుద్ధిచెప్పనంతకాలం వారు సిగ్గు వదిలి రాజకీయాలు చేస్తూనేవుంటారు. నైతికంగా దిగజారిపోతున్న విషయం విస్మరించి, కొత్త రాజకీయాలకు వారసులుగా చెప్పుకుంటుంటారు. తాను పార్టీ మారడానికి, వేరొక కండువా భుజాన వేసుకోవడానికి వీరికి క్షణాల్లో బలమైన కారణాలు దొరికిపోతాయి. వ్యాపారాల కోసమని, స్వీయ లబ్ధి కోసమని సిగ్గు విడిచి చెప్పుకోలేక, ఏ పార్టీ మారినా తాము ప్రజల కోసమేనని నొక్కిచెబుతారు. తన వ్యాపార భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఏ పార్టీలో వుండాలి ? ఏ పార్టీలోకి వెళ్లాలి ? అనేది ఎన్నికలకు ముందు, తరువాత రాజీనామా చేయడం, పార్టీ మారడం ప్రధాన రాజకీయ పార్టీ నాయకులకు ఒక అలవాటు. సేవాభావం, సైద్ధాంతిక నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు పార్టీలే అందుకు మినహాయింపు.

అవంతి విద్యా సంస్థల అధినేత, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తాజాగా వైసిపికి రాజీనామా చేసినట్లు ప్రకటించడం ఆశ్చర్యమేమీలేదు. విద్యా వ్యాపారం చేసిన ఆయన తొలి రాజకీయ ప్రవేశం ప్రజారాజ్యంతో ప్రారంభమైంది. ఆ పార్టీ కాంగ్రెస్‌లో విలీనమైన తరువాత కొంత కాలం అందులో కొనసాగి, తరువాత టిడిపిలో చేరారు. అందులో కొనసాగడం లాభం లేదనుకొని వైసిపిలో చేరి మంత్రి పదవి అనుభవించారు. ఇప్పుడు అధికారంలేని వైసిపిని వీడారు. వేరొక పార్టీలో రేపో, మాపో చేరడమూ ఖాయం. రాజకీయ ప్రవేశం నుంచి ఇప్పటి వరకు ఆయన ఏ పార్టీలోనూ స్థిరంగాలేరు. రేపు వెళ్లిన పార్టీలో వుంటారనీ లేదు. వ్యాపారం చేసుకొని నాలుగు పైసలు కూడబెట్టుకోవడం తెలిసిన వారు మరింత వేగంగా ఎదగడానికి రాజకీయాలను ఒక అస్త్రంగా ఉపయోగించుకోవడం కనబడుతూనేవుంది. ఒకరు విద్య వ్యాపారం, మరొకరు స్థిరాస్థి వ్యాపారం, ఇంకొకరు మద్యం వ్యాపారం, వేరొకరు షిప్పింగ్ వ్యాపారం, గ్రానైట్ వ్యాపారం, కాంట్రాక్టర్లు ఇలా వారివారి నైపుణ్యాలతో సంపాదించుకోవడానికి రాజకీయ ప్రవేశం చేస్తున్నారుగానీ ప్రజల మేలు, బాగుకోరి కాదు.

విద్యుత్ బిల్లులపై నోరు మెదపరు

వీరు ప్రజల బాగుకోరే వారైతే ఎప్పుడో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడమేంటని అడిగేవారు. వినియోగదారులపై భారం వేయడం తగదని మాట్లాడేవారు. గతంలో వైసిపి ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీలు వసూలుచేసినట్లే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీలు వేసి వసూలు చేస్తోంది. సిపిఎం, వామపక్షాలు మినహా సర్దుబాటు ఛార్జీలు రద్దుచేయాలని ఇతర పార్టీలేవీ మాట్లాడ్డంలేదు. వైసిపి ప్రభుత్వంలో సర్దుబాటు ఛార్జీలు వ్యతిరేకించిన టిడిపి, జనసేన, బిజెపిలు సర్దుబాటు ఛార్జీలు వేసి కరెంట్ బిల్లులను ముక్కు పిండి వసూలు చేస్తున్నాయి. విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు పాల ధర మూడు రూపాయలను పునరుద్ధరించి పాల రైతుకు చెల్లించేలా ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవడంలేదు. నష్టపోయిన పాల రైతులు పాత ధర చెల్లించాలని ఆందోళన కొనసాగిస్తున్నారు. టిడిఆర్ కుంభకోణంపై విచారణకు కమిటీ ఏర్పాటుపై జివిఎంసి కౌన్సిల్ ఆమోదం వెనుక సిపిఎం, సిపిఐ, ఇతర కార్పొరేటర్ల కృషి వుంది. కుంభకోణం బహిర్గతం చేయడానికి వారు గట్టిపట్టు పట్టబట్టే ఇది సాధ్యమైంది. కౌన్సిల్‌లో వామపక్ష కార్పొరేటర్లు ఉండబట్టే విచారణ స్థాయికి వెళ్లగలిగింది.

61 ఫోన్లు అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైల్వే ప్రయాణికులు పలు సందర్భాల్లో కోల్పోయిన 61 ఫోన్లను సదరు బాధితులకు గవర్నమెంట్ రైల్వే పోలీస్ విభాగం సిఐ సిహెచ్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యాన శనివారం అందజేశారు. ఈ కార్యక్రమం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లోని ఫ్లాట్ ఫాం నెంబర్ 1లో ఉన్న రైల్వే పోలీస్ కార్యాలయంలో జరిగింది.

నగరంలో ఎన్‌టిఆర్ సినీ నట వజ్రోత్సవం

విశాఖ కలెక్టరేట్ : ఎపి ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శనివారం ఎన్‌టిఆర్ సినీ నట వజ్రోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లోతొలుత ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళ్లర్పించారు

IN THE HON'BLE COURT OF THE X ADDL. DISTRICT JUDGE AT: ANAKAPALLE
E.P.2/2024 in O.S.48/2016

Between:
1) Alapati Yogi Narayana (died) ...D.Hr 1/Plaintiff
2) Alapati Vara Prasad, Rep. by his G.P.A. Holder Sri Jeeru Kranthi Kumar ...Petitioner/D.Hr 2
And:
M/s. Lakshmi Nivas Infra Projects, Rep. by Paluri Chidambara Kali Prasad & another ...J.Drs/Defendants

NOTICE

To,
JDR-1: M/s. Lakshmi Nivas Infra Projects, Rep. by Paluri Chidambara Kali Prasad, S/o. Sri P. Venkata Ramana, Edulapanka Bonanangi Village and Panchayati and Payakarao Bonangi Village, Kotha Gorlevanipalem Panchayati, Parwada Mandal, Visakhapatnam.
JDR-2: Sri M. Chandra Reddy, S/o. Punna Reddy,Rep. by M/s. Lakshmi Nivas Infra Projects, Rep. by Paluri Chidambara Kali Prasad, **Rest-do-**

The above named petitioner/D.Hr has filed the above numbered Execution Petition against the Respondents/J.Drs to Execute Regular Sale Deed in favour of the Petitioner/D.Hr and for other reliefs. The above numbered matter coming for your attendance on **23-12-2024** appearance either in person or through a pleader on the above said date at **10:30 A.M.** before the Hon'ble Court, on that day you attend personally or through your Advocate, failing which the matter is decided by the Hon'ble Court as per law in your absence.

R.D. PRASAD,
G. RAMACHANDRA RAO,
Advocates,Anakapalle,
Cell: 9849506151, 9985699922.

IN THE HON'BLE COURT OF THE II ADDL.DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
I.A.132/2019 in O.S.378/2013

Between:
Smt. Kunisetti Annapurna and another ...Petitioners/Plaintiffs
And:
Sri Kunisetti Sudhakar & others ...Respondents/Defendants

NOTICE

To,
R-1: Sri Kunisetti Sudhakar, S/o. late Satyanarayana, aged 45 years, R/o. D.No.50-98-4, Vivekananda Nagar, Seethammadhara, Visakhapatnam.
R-2: Sri Krishna Rao, father's name not known to petitioners, R/o. D.No.50-98-4, Vivekananda Nagar, Seethammadhara, Visakhapatnam.
R-3: K. Vineetha, W/o. Israil, R/o. D.No.50-98-4, Vivekananda Nagar, Seethammadhara, Visakhapatnam.

Please take notice that the petitioners/plaintiffs filed the above petition uner Section 5 of the Limitation Act praying the Hon'ble Court to condone the delay of 132 days in filing the petition to set aside the dismissal order dated 01-10-2018 passed in O.S.378/2013. The petition stands posted to **06-01-2025** for your appearance. Therefore, you are hereby called upon to appear before the Hon'ble Court on the above said date at **10:30 A.M.** either in person or through a pleader. In default of your appearance, the Hon'ble Court will decide the matter ex-partely.

(By Order of Hon'ble Court)
G.M. REDDY &
B. VIVEKANANDA REDDY
Advocates, Visakhapatnam,
Cell: 9849113617.

IN THE HON'BLE COURT OF V ADDL. DISTRICT AND SESSSION JUDGE CUM TRIAL OF OFFENCES AGAINST WOMEN JUDGE COURT, VIZIANAGARAM
SUIT NO. 81 OF 2016 I.A.268/2024

Between:-
1.Komanduri Venkata Krishna and two others. ....Petitioners/Plaintiffs.
And
1. Sri K.A.Krishnamacharyulu and others. ....Respondents/Defendants.

To
22) Smt.Kalidindi Krishna Vani W/o Kalidindi Venkata Ramabhadra Kumara Raju, R/o Door No. 1-110-8, Plot No.99, MVP Colony Sector-VIII, Visakhapatnam Town and District,
23) Smt.Kalidindi Lakshmi Anisha D/o Kalidindi Venkata Ramabhadra Kumara Raju, R/o Door No. 1-110-8, Plot No.99, MVP Colony Sector-VIII, Visakhapatnam town and District,

Whereas the Honourable court ordered notice to you in the above IA 268/2024 in OS 81 of 2016 for your appearance on **20-12-2024 at 10:30 AM** before the Honourable court in person or through an advocate and submit your objections if any. Failing which the Honourable court shall pass appropriate orders in your absence according to law.

K.V.R SASTRY
ADVOCATE,
Vakkalankavari street,
Vizianagaram 535002
Cell No: 9550750511

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
IA No.1019/2024 in O.S.No.46/2024

Between:
Smt. Gorusupudi Govindamma and 3 others ......Petitioners/Plaintiffs.
And:
Gorusupudi Suryanarayana and 2 others ......Respondents/Defendants.

To,
3. Gadiraju Venkata Satya Linga Dhana Rama Raju S/o Ramakrishnam Raju, aged about 47 years, Business, residing at Door No.50-27-17/4, TPT Colony, Seethammadhara, Visakhapatnam.

NOTICE

Please take notice that above matter stands posted to **24-12-2024** for appearance of the 3 Respondent/Defendant and they should appear before the above Court on that day in person or through an Advocate and if they fails to appear on that day at **10-30 A.M.,** the matter will be heard and decide exparte.
As per the orders of the Honourable Court.

V.G.SANTOSH
VAMSI KRISHNA
Advocates,
MIG-III-120, Phase-III,
Vuda Colony, Cantonment,
VIZIANAGARAM.

IN THE HONOURABLE COURT OF THE II nd ADDL. JUNIOR CIVIL JUDGE- MOBILE COURT AT VIZIANAGARAM
I.A NO: 474/2024 IN O.S. NO: 360/2024

Between:-
Sri. G. Satya Suryanarayana Raju ......Plaintiff
And:-
Sri. Lanka Appalaswamy and 5 others ......Defendants

SUBSTITUDE NOTICE TO THE DEFENDANT NO: 6

TO,
Sri. Lakkoju Shanmukha Rao, S/o late Mchana Rao, R/o H.No: 64-24-32/A/2, Kunchamma Colony, Shriharipuram, Visakhapatnam.

Please take notice that the above numbered I.A. No:474/2024 and in O.S. No: 360/2024 filed by the plaintiff for declaration and the said suit is stands posted to 30-12-2024 for your appearance and you are hereby ordered to appear before the Court on **30-12-2024 at 10-30 A.M** in person or through an advocate or else the matter will be decided in your absence by the Honourable Court.
(BY THE ORDER OF THE COURT)

VARRI DEMUDU BABU
Advocate for plaintiff
Vizianagaram
Cell No: 94402 37075

రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటుచేసుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇంధన వనరులను పొదుపు చేయాలని, రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకోవాలని వినియోగదారులకు ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇమ్మడి పిలుపిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకొని పోస్టర్లు, కరపత్రాలను శనివారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఎమ్‌డి మాట్లాడుతూ భావితరాల అవసరాల దృష్ట్యా విద్యుత్ పొదుపు తప్పనిసరిగా పాటించాలని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని 11 జిల్లాల్లో విద్యుత్ పొదుపు వారోత్సవాలను డిసెంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యుత్ పొదుపుపై అవగాహన పెంచేందుకు ఎల్‌ఈడి బల్బుల వినియోగం, ఇంధన పొదుపు చిట్కాలు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల వినియోగపు ప్రయోజనాలు, విద్యుత్ పొదుపుపై అవగాహనా ర్యాలీలు, కళా ప్రదర్శనలు, పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు, నిర్వహించాలని, ఇపిడిసిఎల్ ఉద్యోగులంతా రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకొనేవిధంగా చర్యలు తీసుకోవాలని 11 జిల్లాల ఎస్ఇలకు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం సర్కిల్ ఎస్ఇ జి.శ్యాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పోలాకి శ్రీనివాసరావు, బికె.నాయుడు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సుమన్, పి.జ్యోతి, సిహెచ్.రామభద్రశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్

ప్రత్యేక తరగతులను పరిశీలించిన డిఇఒ

పద్మనాభం కస్తూరిబా పాఠశాలలో డిఇఒ ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి -యంత్రాంగం

పద్మనాభం : మండలంలోని పద్మనాభం జిల్లా పరిషత్ హైస్కూల్, కెజిబివి పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని సాధించేందుకు అంకితభావం, ఆసక్తితో చదువుకోవాలని చెప్పారు. అనంతరం 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కార్యాచరణ ప్రణాళికను అనుసరించాలని సూచించారు. సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు.

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి ఉన్నత పాఠశాలను డిఇఒ ప్రేమ్‌కుమార్ సందర్శించారు. పదోతరగతి తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వం జారీ చేసిన 100 రోజుల ప్రణాళికను అమలు చేసి శత శాతం ఫలితాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు బి.అప్పారావు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు శశి

150 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు చేశారు. 40 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. నేత్ర వైద్యులు శశి, సిబ్బంది వివేక్‌వర్మ, క్యాంప్ కో-ఆర్డినేటర్ వై.రాజు, కె.దేవి సేవలందించారు. ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.రమణ, జూనియర్ అసిస్టెంట్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

సోమరాజు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు తదితరులు

సోమరాజు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మున్సిపాలిటీగా ఉన్న కాలంలో సిపిఐ తరపున రెండు పర్యాయాలు కౌన్సిలర్‌గా గెలిచి ప్రజల సమస్యలపై పోరాడిన నేత తూతిక సోమరాజు అని పలువురు కొనియాడారు. జివిఎంసి ఒకటో వార్డు కొత్తపేటలో సోమరాజు సంస్మరణ సభ శనివారం నిర్వహించారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, పార్టీ నాయకులు అల్లు బాబూరావు, కానూరు రాంబాబు, ఎం.అప్పలరాజు, ఎన్.ఆది నారాయణ, సిపిఎం జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, నాయకులు ఎస్.అప్పల నాయుడు, పంపాన సూర్యనారాయణ, జీరు సత్యారావు, కర్రి రాము తదితరులు వేర్వేరుగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నిజాయతీ గల నేతను కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

'కేథరిన్'ను సందర్శించిన విక్టోరియా వర్సిటీ బృందం

ప్రజాశక్తి -తగరపువలస : ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌కు చెందిన విక్టోరియా యూనివర్సిటీ నుంచి 20 మందితో కూడిన అధ్యాపక బృందం తమ అధ్యయన పర్యటనలో భాగంగా శనివారం స్థానిక కేథరిన్ విద్యా సంస్థలను సందర్శించారు. తరగతి గదిలో బోధనా శైలి, వాటి నిర్వహణ, నిరాదరణకు గురికాబడిన విద్యార్థులను గుర్తించడంతో పాటు వారి పట్ల చూపుతున్న ఆదరణ తదితర ఎన్నో అంశాలు విక్టోరియా యూనివర్సిటీ బృందం సభ్యుల పరిశీలనలో వెల్లడైనట్లు కేథరిన్ విద్యా సంస్థల అధినేత ఆలివర్ రాయి తెలిపారు. విద్యాప్రమాణాలు పాటించడంలో కేథరిన్ విద్యా సంస్థల విశిష్టతను బృందం సభ్యులు కొనియాడారని పేర్కొన్నారు. దాదాపు ఎనిమిదేళ్లుగా విక్టోరియా యూనివర్సిటీ, తమ విద్యా సంస్థతో కొనసాగుతున్న భాగస్వామ్య అనుబంధాన్ని ఆలివర్ రాయి గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల పేద, మధ్య తరగతి విద్యార్థులకు అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో విద్యనందిస్తూ తమ విద్యా సంస్థలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కేథరిన్ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఇవేంజలిన్ రాయికి విక్టోరియా యూనివర్సిటీ అనుబంధ గౌరవ ఆచార్యులుగా బృందం సభ్యులు నియామక పత్రం అందజేశారు.

విక్టోరియా యూనివర్సిటీ బృందం సభ్యులతో కేథరిన్ విద్యా సంస్థల అధినేత ఆలివర్ రాయి, డైరెక్టర్ డాక్టర్ ఇవేంజలిన్ రాయి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి హౌసిమీనగర్, ఉడా కాలనీ, టీచర్స్ లే-అవుట్ ప్రాంతాల్లో సుమారు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్నింగ్ వాకింగ్‌లో అక్కడున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తనకు ఫోన్ చేయొచ్చని చెప్పారు. అనంతరం వినతి పత్రాలను తీసుకుని చిన్న చిన్న సమస్యలను అక్కడే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పిల్లా జగన్నపాత్రుడు, కిషోర్, జనసేన ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ సుధ, టిడిపి నాయకులు శంకరరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చినముషిడివాడ ఉడా లే-అవుట్‌లో మెగా పార్క్‌కు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు శంకుస్థాపన చేశారు. రోడ్లు వేయాలని, శ్మశాన వాటికను నిర్మించాలని కోరుతూ ఎమ్మెల్యేకు ఉడా రెసిడెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు విస్సకోట రాము ఆధ్వర్యాన కాలనీ ప్రతినిధులు ఎమ్‌విఆర్. పాత్రుడు, పి.గోవిందరావు, వై.రామకోటి, యువిఆర్.మూర్తి, ఎమ్.శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, ప్రకాశరావు వినతిపత్రాన్ని అందించారు.

నేడు లక్ష్మి విజయ మెడికేర్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో జోన్ పరిధి తగరపువలస సంగివలసలో నిర్మించిన లక్ష్మి విజయ మెడికేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ డివి.రామభద్రరాజు, డాక్టర్ రమ్యవత్సవాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కేంద్ర మంత్రి, విజయనగరం మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతి రాజు, భీమిలి, విజయనగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు, లోకం నాగ మాధవి హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అల్లు అర్జున్‌కు ఎమ్మెల్యే గంటా, ముత్తంశెట్టి పరామర్శ

ప్రజాశక్తి -భీమునిపట్నం : పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్‌ను హైదరాబాద్‌లోని అతని నివాసంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం వేర్వేరుగా కలిసి పరామర్శించారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

10వ వార్డులో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి మండల పరిధి 10వ వార్డు రవీంద్రనగర్‌లో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇంటి సమస్యలపై 9, 10, 11 వార్డుల పరిధిలోని స్థానికులు వినతిపత్రాలు అందించారు. శ్మశాన వాటికకు మూడెకరాల స్థలం కేటాయించాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు కోరారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందజేసారు. చినగదిలి తహశీల్దారు పాల్ కిరణ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, 9, 10 వార్డుల కార్పొరేటర్లు మద్దిల రామలక్ష్మి, కోరుకొండ స్వాతీదాస్, జెడ్పీ ఫణికుమార్, టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దని ఆందోళన

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ స్వయంకృషి నగర్, అయ్యప్పనగర్‌లోని నివాస ప్రాంతంలో మద్యం షాపు వద్దని ఐద్వా ఆధ్వర్యాన మహిళలు శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు బి.భారతి, సిఐటియు నాయకులు డి.కొండమ్మ మాట్లాడుతూ, స్వయంకృషినగర్‌లో మద్యం షాపు పెట్టాలని చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరారు. మహిళలు, చిన్నారులు తిరిగే ఈ ప్రాంతంలో అధికారులు ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. నివాసాల మధ్య మద్యం అమ్మకాలు ఆపాలని ప్రజలు, మహిళలు అనేక ప్రాంతాలలో నిరసనలు తెలుపుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె.మణి, టికె.శారద, కె.వెంకటరావు, ఎ.రామచంద్రారెడ్డి, వి.సంధ్య, నాగమణి, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దని ఆందోళనచేస్తున్న మహిళలు

ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం మహాసభల జయప్రదానికి ప్రచారం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తిలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించే సిపిఎం మహాసభలను జయప్రదం చేయాలని 94వ వార్డు పరిధి రవినగర్, 97వార్డు పులగానిపాలెంలో శనివారం ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బి.రమణి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. దీనికి తోడు విద్యుత్ చార్జీల భారాలను మోపిందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరూ ఉద్యమ బాట పట్టాల్సిన అవసరం ఉందన్నారు. పేద ప్రజల కోసం సిపిఎం ఎప్పుడూ పోరాటాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పలనాయుడు, వెంకటలక్ష్మి, మహేష్, ఈశ్వరరావు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న విశాఖ డెయిరీ కార్మికులు

కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ కాంటాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని విశాఖ డెయిరీ కాంటాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షులు పిల్లా భాస్కరరావు డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 24 రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి భాస్కరరావు మాట్లాడుతూ, ఐదేళ్ల సర్వీసు దాటిన కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. శాశ్వత స్వభావం కలిగిన పనులు చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని చట్టం చెబుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. విశాఖ డెయిరీ కాంటాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దాడి నాగమరణిబాబు మాట్లాడుతూ, డెయిరీ యాజమాన్యం వివిధ రకాల పేరుతో విభజించి కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా తక్కువ జీతాలతో పని చేయిస్తున్నారని ఆరోపించారు. విశాఖ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ మాట్లాడుతూ, కాంట్రక్టు లేబర్ యూనియన్ చేస్తున్న పోరాటానికి ఎంప్లాయిస్ యూనియన్ మద్దతు ఉంటుందన్నారు. సమస్య పరిష్కారమయ్యేవరకూ పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. అని సంఘాల మద్దతు ఉంటుదని హామీ ఇచ్చారు.

ఎంవిఆర్‌లో జాతీయ శక్తి పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో జాతీయ శక్తి పరిరక్షణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ, సోలార్ ఎనర్జీ ఉపయోగాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపల్ సిహెచ్.రామ సన్యాసిరావు, లెక్చరర్లు లక్ష్మీప్రసన్న, మౌనిక పాల్గొన్నారు.

పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

విద్యుత్ భారాలపై నిరసనల హోరు

పలుచోట్ల బిల్లుల దగ్ధం

మధురవాడ శివశక్తినగర్‌లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-యంత్రాంగం

విద్యుత్ ఛార్జీల భారాలపై నిరసనలు హోరెత్తాయి. పలుచోట్ల విద్యుత్ బిల్లులను శనివారం దగ్ధం చేశారు.

మధురవాడ : మధురవాడ శివశక్తినగర్ ప్రధాన రహదారిలో విద్యుత్ బిల్లులను సిఐటియు, ఐద్వా ఆధ్వర్యాన ప్రజలు దగ్ధం చేశారు. అధికారం ఇస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ప్రచారం చేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక మాట తప్పారని సిఐటియు, ఐద్వా నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో డి.కొండమ్మ, బి.భారతి, ఎస్.నాయుడు, టికె.శారద, పి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలసలో బిల్లులు దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

తగరపువలస : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన, విధించిన ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన స్థానిక వై జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెంచిన విద్యుత్ చార్జీల బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, విద్యుత్ భారాలు తగ్గించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.నాగరాణి, ఎస్.అప్పలనాయుడు, పంపాన సూర్యనారాయణ, జీరు సత్యారావు, ఆటో కార్మిక సంఘం నాయకులు నీలాతి రాము, పెంట రాజు, పల్లా రమణ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : సిపిఎం గాజువాక జోన్ కమిటీ ఆధ్వర్యాన 76వ వార్డు పరిధి స్వతంత్రనగర్‌లో పార్టీ జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు ఆధ్వర్యాన బిల్లులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వం విధానాలనే చంద్రబాబు అనుసరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీదేవి, లక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

సిపిఎం స్టీల్ జోన్ కమిటీ ఆధ్వర్యాన 75వ వార్డు పరిధి నడుపూరు హైస్కూల్ వద్ద విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, బి.గురప్ప, డి.వెంకటరావు, బి.ఆనంద్, సిహెచ్.రాముడు, బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని మండలంలోని ఏ.కోడూరు గ్రామంలో శనివారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం మండల నాయకులు వనము సూర్యనారాయణ మాట్లాడుతూ, సూపర్ 6 పథకాలు అమలు చేయాలన్నారు. పెంచిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, రైతు పెట్టుబడి సాయం కింద 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.చెరుకు బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, అప్పలనాయుడు, మల్లు నాయుడు పాల్గొన్నారు.

స్వతంత్రనగర్‌లో బిల్లులను దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

నడుపూరులో బిల్లులను దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

షిప్‌యార్డ్‌ను సందర్శించిన ఎంవిఆర్ డిగ్రీ విద్యార్థులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఎంవిఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన బిబిఎ, బీకాం విద్యార్థులు ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా శనివారం షిప్ యార్డ్‌ను సందర్శించారు. వారికి ఇన్‌ఛార్జి రామ్ స్వరూప్, వివి.కామేశ్వరరావు గైడ్‌గా వ్యవహరించి విషయాలను వివరించారు. ఈ టూరు కామర్స్ విభాగానికి చాలా ఉపయోగపడుతుందని వారు తెలిపారు.

ఉక్కు కార్మికులపై యాజమాన్య వైఖరి మారాలి

ప్రజాశక్తి -ఉక్కునగరం : ఉక్కు ఉత్పత్తులపై అకుంఠిత దీక్షతో పనిచేస్తున్న ఉక్కు కార్మికులపై యాజమాన్యం తన వైఖరిని మార్చుకోవాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. ప్లాంట్‌లోని సిఎంఎస్ పాయింట్ వద్ద స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీస్ బేరర్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, ప్రభుత్వం, యాజమాన్యాలు ఉత్పత్తికి అనుకూల పరిస్థితులు కల్పిస్తే ఉక్కు కార్మికులు తమ అనుభవాన్ని రంగరించి అద్భుత ఫలితాలు సాధిస్తారని నిరూపితమైందన్నారు. కార్మికులను ఆర్థికంగా కృంగదీస్తూ వారిపై ఆధిపత్యాన్ని చెలాయించాలనే కుతంత్రాలకు స్వస్తి పలకాలని కోరారు. యాజమాన్యం తన వైఖరిని మార్చుకొని కార్మికులకు న్యాయంగా చెల్లించాల్సిన జీతభత్యాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగానే 18వ తేదీన జరిగే మహిళల ధర్నాలో పెద్ద ఎత్తున ఉక్కు మహిళలు పాల్గొనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తన వాగ్దానాలను మరచి కేంద్రంలోని బిజెపి విధానాలను సమర్థించడం అత్యంత శోచనీయమని అన్నారు. స్థానిక పార్లమెంట్, అసెంబ్లీ సభ్యులు స్టీల్ యాజమాన్యంపై రాజకీయ ఒత్తిడిని పెంచి పరిశ్రమ, కార్మికులకు అనుకూల నిర్ణయాన్ని తీసుకునే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. తద్వారానే ఈ స్టీల్‌ప్లాంట్ భవిష్యత్ తరాలకు ఉపాధి అవకాశాలను కల్పించగలుగుతుందని చెప్పారు. ఆ దిశగా జరిగే ప్రజా ఉద్యమాలను బలపరుస్తూ స్టీల్ కార్మిక వర్గం ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, యూనియన్ నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె.గంగాధర్, కృష్ణమూర్తి, టివికె.రాజు, కెవి.సత్యనారాయణ, పుల్లారావు, కె.బాలశౌరి, మహేష్, భానుమూర్తి, శ్రీనివాస్, దేముడునాయుడు, లాంబ్రెట్, డి.సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, వి.ప్రసాద్, వివిధ విభాగాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఖోఖోలో 'బుల్లయ్య'కు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆంధ్ర యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళల ఖోఖో టోర్నమెంట్‌లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ తెలిపారు. కాలికట్‌లో జరగబోయే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీలకు బుల్లయ్య కళాశాల నుంచి హేమ, చైతన్య దీపిక, నవ్యశ్రీ ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులను మధుకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె. చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, టి.బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 35వ వార్డు పరిధిలో 100 మంది గర్భిణులకు ఎన్‌టిఆర్ వైద్య సేవ కమిటీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యాన సీమంతం నిర్వహించారు. పోషకాహారం, హార్లిక్స్, స్వీట్లు, కొబ్బరిబండాలు, చీరలు రవిక, గాజులు, పసుపు, కుంకుమ ఏర్పాటుచేసి సీమంతాలను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, నాయకులు బుచ్చా రాముమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరుకు నూతన వంగడాలను రాయితీపై ఇవ్వాలి

మాట్లాడుతున్న ఏపి చెరుకు రైతు సంఘం నాయకులు అప్పారావు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో రూపొందించిన నూతన చెరుకు వంగడాలను రైతులకు రాయితీపై ప్రభుత్వం అందించాలని, బెల్లానికి గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు కోరారు. కిసాన్ మేళా సందర్భంగా జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, 110 సంవత్సరాల చరిత్ర గల చెరకు పరిశోధన స్థానంలో ప్రభుత్వాల వైఖరి బాగుండక రెండు లక్షల ఎకరాలలో పండించే అనకాపల్లి ప్రాంతం 13000 ఎకరాలకు దిగజారిందని ఆవేదన వ్యక్తంచేశారు. సహకార రంగంలో ఉన్న నాలుగు సుగర్ ఫ్యాక్టరీలలో మూడింటిని మూత వేశారని, గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధర, 15 రోజుల్లో పేమెంట్ ఇవ్వకపోవడంతో చెరుకు విస్తీర్ణం తగ్గిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని, కొత్త వంగడాలకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలని, బెల్లానికి గిట్టుబాటు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎయులో పాళి, బౌద్ధ అధ్యయనాలపై ఆన్‌లైన్ ఎంఎ

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పాళి, బౌద్ధ అధ్యయనాలలో ఆన్‌లైన్ ఎంఎ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం, శ్రీ జయవర్ధనపుర విశ్వవిద్యాలయం, శ్రీలంక నుంచి అధికారులు ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రధాన అతిథిగా శ్రీ జయవర్ధనపుర విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్, సీనియర్ ప్రొఫెసర్ పత్మలాల్ మానగే హాజరై మాట్లాడుతూ, ఆంధ్రా విశ్వవిద్యాలయం పాళి, బౌద్ధ అధ్యయనాల విభాగంలో సహకార ప్రోగ్రామ్‌ను పెంచడం కోసం చేసిన కృషిని అభినందించారు. రెండేళ్ల ఎంఎ ప్రోగ్రామ్ ప్రాముఖ్యతను సమకాలీన సమాజానికి వివరించారు.

ఆంధ్రా విశ్వవిద్యాలయం రెక్టర్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు మాట్లాడుతూ, ఈ జాయింట్ ప్రోగ్రామ్ ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎ.నరసింహరావు, యోగా శాఖాధిపతి ప్రొఫెసర్ కె.రమేష్‌బాబు మాట్లాడుతూ, ఈ ఎంఎ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో యోగా విభాగ ప్రొఫెసర్ భక్తిలా పాల్గొన్నారు.

దుప్పట్లను పంపిణీ చేస్తున్న మొల్లేటి పరమేశ్వరరావు, మాణిక్యం

దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి- మునగపాక: మండలంలోని మూలపేట గ్రామానికి చెందిన కీర్తిశేషులు మొల్లేటి శంకర్ గణేష్ జయంతి సందర్భంగా అతని జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు మొల్లేటి పరమేశ్వరరావు, మాణిక్యం దంపతులు శనివారం గ్రామంలో సుమారు 120 మంది పేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. గ్రామంలోని మెయిన్ రోడ్డు నుంచి గంగాలమ్మ గుడి వరకు 15 వీధిలైట్లు తమ సొంత నిధులతో వేయించారు. శంకర్ గణేష్ జ్ఞాపకార్థం అతని తల్లిదండ్రులు ఇటీవల అనకాపల్లి - మూలపేట మార్గంలో రూ.8 లక్షలతో గంగాలమ్మ అమ్మవారి ముఖ ద్వారం నిర్మించారు. కుమారుని జ్ఞాపకార్థం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తారురోడ్డుపై గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సంత, భీమవరం బ్రిడ్జి వద్ద తారు రోడ్డుపై గుంతలను శనివారం పూడ్చారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు సంక్రాంతికి ఎక్కడా గోతులు ఉండకూడదన్న నిర్ణయం మేరకు ఇక్కడ గుంతలను పూడ్చారు. దీంతో వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తారురోడ్డుపై గుంతలు పూడ్చుతున్న కార్మికులు

బస్‌స్టాప్ వద్ద ఆందోళన చేస్తున్న ఐద్వా నాయకులు

బస్‌స్టాప్ నిర్మించాలని ఐద్వా నిరసన

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురం జంక్షన్‌లో బస్‌స్టాప్ నిర్మించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, జాయింట్ సెక్రటరీ ఆర్.లక్ష్మి డిమాండ్‌చేశారు. ఈ మేరకు అచ్యుతాపురంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అచ్యుతాపురం జంక్షన్ రోజుకు 18 గంటలు ప్రయాణికులతో నిండి ఉంటుందని తెలిపారు. నిలువ నీడ లేక వర్షానికి తడిసి ఎండకు ఎండి బస్సులు కోసం ప్రయాణికులు నిరీక్షించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ ప్రతినిధులు స్పందించి ప్రయాణికుల సమస్యను పరిష్కరించాలని కోరారు.

లక్ష్యసాధనపై అవగాహన

ప్రజాశక్తి- అనకాపల్లి : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకోవడం, దానిని సాధించుకోవడంలో ఏ విధంగా ఉండాలనే అంశంపై ఎఎంఎఎల్ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఆంధ్రప్రదేశ్ రోటరీ క్లబ్ అధ్యక్షులు, ఎఎంఎఎల్ కళాశాల సిల్వర్ జూబ్లీ కరస్పాండెంట్ వివి.సన్యాసిరావు మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యం ఏర్పరుచుకుని నడుచుకోవాలన్నారు. లక్ష్యాన్ని సాధించని పక్షంలో నిరాశపడకుండా, సాధించ లేకపోవటానికి కారణం తెలుసుకొని, దానిని సరిదిద్దుకొని ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. జీవితం చాలా విలువైనదని, క్షణికావేశంలో జీవితాన్ని పాడు చేసుకోకూడదని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.నిరంజన్‌కుమార్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ లక్ష్యం నిర్ణయించుకోవడంలో ఉన్న అవకాశాలను వినియోగించు కోవాలన్నారు. అనంతరం వివి.సన్యాసిరావును కళాశాల యాజమాన్యం తరుపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బిఎంవిపి.నాయుడు, కళాశాల సూపరింటెండెంట్ అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో పాల్గొన్న యువత

ఎడ్యుస్కిల్స్ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

డైట్‌లో సాంకేతిక శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎడ్యుస్కిల్స్ ఫౌండేషన్ సహకారంతో డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సాంకేతిక శిబిరం నిర్వహించారు. ఎడ్యుస్కిల్స్ అకాడమీ అసోసియేట్ మేనేజర్ ఎస్‌వి.పవన్ కుమార్ ఆధ్వర్యాన సెల్‌సోర్స్ బిజినెస్ అనలిటిక్స్, గూగుల్ ఎఐ-ఎంఎల్ అంశాలపై అవగాహన కల్పించారు. భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంచడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మౌలిక కోడింగ్ నైపుణ్యాలను అందించడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ముసలితల్లి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం

ఘనంగా ముసలితల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : దుప్పుతూరు శివారు ముసలమ్మపాలెం గ్రామంలో శనివారం ముసలితల్లి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. తాడుపెద్ది సేవ, తప్పెటగుళ్లు తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు, దేవుడు, కొండబాబు, అర్జున, సన్నిబాబు, శ్రీను, అర్జున్‌రావు, నాయుడుబాబు, అర్జున్, రాజబాబు, రమాదేవి, కుమారి, మణి, శ్రావణి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

కుంచావారి గౌరీ పరమేశ్వరుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కొణతాల

గౌరీ పరమేశ్వరుల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో ప్రతిష్ఠాత్మకమైన కుంచా వారి గౌరీ పరమేశ్వరుల ఉత్సవ పోస్టర్‌ను శనివారం స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆవిష్కరించారు. పట్టణంలోని రింగ్ రోడ్డు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు కుంచ చిన్ను, దూలం గోపి, అబ్బులు, కొమ్మోజు రామకృష్ణ, కర్రి కృష్ణ, అంగిన రేవంత్, గణపతి, సాయి, జగన్నాథ్, అఖిలేష్, పరమేశ్, మోహన్, ఇమామ్, బోయిన చిన్ని, మణికంఠ, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హస్తకళల ప్రదర్శన

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మూడు రోజులపాటు నిర్వహించిన హస్తకళల ప్రదర్శన శనివారంతో ముగిసింది. వెదురు, ఉడ్‌తో విద్యార్థుల సమక్షంలో హస్తకళలను తయారుచేసి చూపించారు. కళాశాల వ్యవస్థాపకులు ధర్మారెడ్డి ప్రసాద్ ఆధ్వర్యాన మూడు రోజులు నిర్వహించిన ప్రదర్శనలో విద్యార్థులు, ఎన్‌సిసి క్యాడెట్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ శ్రీదేవి

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపల్ శ్రీదేవి స్టడీ మెటీరియల్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రవేశపెట్టిన సంకల్పం కార్యక్రమంలో భాగంగా వెనుకబడిన విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా క్వశ్చన్ బ్యాంక్ పుస్తకాలు అందజేయడం జరిగిందన్నారు. ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకొని శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. జిల్లాలో గత విద్యా సంవత్సరంలో నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉత్తీర్ణతలో నాలుగవ స్థానం సాధించిందని, ఈ విద్యా సంవత్సరంలో ప్రథమ స్థానం సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఆ దిశగా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భీమసేన అప్పారావు, హేమలత, శైలజ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా..

సాగునీటి సంఘాల ఎన్నికలు

మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం: అప్రజాస్వామికంగా నిర్వహిస్తున్న సాగునీటి సంఘాల ఎన్నికలను వైసిపి అధినేత వైయస్ జగన్ ఆదేశాల మేరకు బహిష్కరించినట్టు మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చెప్పారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వ తీరు దారుణంగా ఉందన్నారు.సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఆయా జిల్లాల్లో ప్రభుత్వ సూచనలతో అధికార యంత్రాంగం వ్యవహరించిన తీరును టెలి కాన్ఫరెన్స్‌లో సమీక్షించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లాల నేతల నుంచి వచ్చిన అభిప్రాయాలను పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లామన్నారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్, ఈ సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న అత్యంత దారుణ వైఖరికి నిరసనగా బహిష్కరించాలని నిర్ణయించారన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో వైసీపీ పోటీ చేస్తున్న చోట్ల రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాన్ని ప్రయోగించి, కూటమి ప్రభుత్వం దారుణంగా అధికార దుర్వినియోగంకు పాల్పడుతోందని తెలిపారు.అడిగిన చోట్ల సీక్రెట్ బ్యాలెట్ ప్రకారం ఎన్నికలు జరపాల్సి ఉంటుందన్నారు.ఆ బాధ్యత ప్రభుత్వ యంత్రాగానిదే దానికి పూర్తి భిన్నంగా కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఏకపక్షంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్నారు.జిల్లాల్లో రెవెన్యూ అధికారులు ఎన్‌ఓసీలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారనీ, దాన్ని ప్రశ్నించిన పార్టీ నాయకులను, ప్రజా ప్రతినిధులను హౌస్ అరెస్ట్‌లు చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.కూటమి పార్టీలకు చెందిన నేతలు తమకు గెలిచే అవకాశం లేకపోయినా దౌర్జన్యంతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎలాగైనా సరే గెలవాలనే ఉద్దేశంతో రౌడీయిజానికి కూడా దిగారన్నారు. వాటిని వెలుగులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నించిన మీడియాపైనా దాడులకు దిగడం కూటమి ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలకు అర్థం పడుతోందన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేయొద్దని, కూటమి ప్రభుత్వ దాష్టికానికి నిరసగా ఈ ఎన్నికలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉండాలని నేతలు అభిప్రాయపడ్డారన్నారు. ఎన్నికలను బహిష్కరించడంతో కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక, నిరంకుశ విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని పార్టీ అధినేత వైయస్ జగన్ నిర్ణయించినట్లు ధర్మశ్రీ తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే రాజు, తదితరులు

ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: మండలంలోని నీ లకంఠా పురంలో జరిగే ఆంజనేయస్వామి ఉత్సవ పోస్టర్‌ను చోడవరం ఏంఎల్‌ఏ రాజు ఆవిష్కరణ చేశారు. ఉత్సవాల్లో పాల్గొనాలని నిర్వాహకులు ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కోట సత్యనారాయణ, ఉప సర్పంచ్ దాడి సూరి నాగేశ్వరరావు, పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు దొండా సన్యాసిరావు, దాడి గోవింద, మాజీ సర్పంచ్ సకల లోవ రాజు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఉపమాకలో ధనుర్మాసోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ఈనెల 16వ తేదీ నుండి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయని, అనుభవంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు తెలిపారు. ఈనెల 16వ తేదీ ఉదయం గరుడాద్రి పర్వతం పై వేంచేసియున్న కల్కి వెంకటేశ్వర స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం అనంతరము ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. జనవరి 14వ తేదీ వరకు 30 రోజులపాటు శ్రీదేవి భూదేవి సమేత కల్కి వేంకటేశ్వర స్వామి, గోదాదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులతో ప్రతిరోజు రెండు వాహనములతో ఒకే సమయంలో 30 రోజులపాటు గ్రామ తిరువీధి సేవలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా జనవరి 10వ తేదీ శుక్రవారం స్వామివారి ఉత్సవ మూర్తులకు రంగనాథుని అలంకరణ చేసి ఆలయంలో వివిధ ఉత్సవమూర్తులతో సాయంత్రం 8 వాహనములతో గ్రామ తిరువీధి సేవ నిర్వహిస్తామన్నారు.రాత్రి వేళలో వాహన సేవలు నిర్వహించడం జరుగుతుందన్నారు.జనవరి 13వ తేదీ సోమవారం మధ్యాహ్నం 11 గంటలకు గోదాదేవి అమ్మవారి పుష్ప తోటలో గోదా రంగనాదుల వార్షిక కళ్యాణోత్సవం, 14న స్వామివారి తిరువీధి సేవ, 15న గిరి ప్రదక్షిణ ఉత్సవం,తిరువీధి సేవ నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు

ఉపమాక వెంకన్న ఆలయం

కానుకను అందజేస్తున్న తాతయ్యబాబు

పెళ్లికానుక అందజేత

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: మండలంలోని కొండపాలెంలో ఇటీవల వివాహం చేసుకున్న నూతన దంపతులకు రాష్ట్ర ఐటీ విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ పెండ్లి కానుక పంపించారు. ఈనెల 6న స్థానిక టిడిపి నేత, సర్పంచ్ ముచ్చకర్ల వెంకటస్వామి నాయుడు కుమారుడు రామ్ వివాహం జరిగింది. నూతన దంపతులను ఆశీర్వదిస్తూ వస్త్రాలు స్వీట్లు పంపించారు. సంబంధిత పెళ్లి కానుకను శనివారం జిల్లా టిడిపి అధ్యక్షుడు, స్టేట్ హౌసింగ్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు చేతుల మీదుగా నూతన వధూవరులకు అందజేశారు.

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: మండలంలోని గొర్లిపాలెం గ్రామం శివారు ప్రాంతంలో సరుగుడు తోటల్లో నాటుసారా బట్టీలపై చోడవరం ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు చేసారు. పోలీసులను గమనించిన నాటుసారా తయారుదారులు పారిపోయారు. ఈ మేరకు సారా తయారు కి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసినట్లు ఇన్స్పెక్టర్ శేఖర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై అప్పారావు, హెడ్ కానిస్టేబుల్, డి.గానేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ రాంబాబు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న పులుపు

విద్యుత్‌ను ఆదా చేసుకోవాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మండలంలోని పెద్ద బొడ్డేపల్లిలో నర్సీపట్నం ఏపీ ఈపీడీసీఎల్ డివిజన్ ఆఫీసులో శనివారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల భాగంగా బ్యానర్లు, పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ డిఈఈ త్రినాధరావు మాట్లాడుతూ, ప్రజలు విద్యుత్తును ఆదా చేయాలని అన్నారు. ఎలక్ట్రికల్ ఏఈ వి.మనోజ్ కుమార్ మాట్లాడుతూ,జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను వారం రోజుల పాటు నిర్వహించనున్నామన్నారు.

బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

26 నుంచి వాలంటీర్ల రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీలోని మండల కేంద్రాల్లో ఈ నెల 26, 27, 28తేదీలలో గ్రామ వాలంటీర్ల సామూహిక రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు వాలంటీర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు, బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా వాలంటీర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు, కొండబాబు, ప్రసాద్ తెలిపారు. శనివారం పాడేరు సిఐటియు కార్యాలయంలో సురేష్ అధ్యక్షతన జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బకాయి పడ్డ 7 నెలల వేతనాలతో పాటు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం రూ. 10000 వేతనంతో గ్రామ వాలంటీర్లను విధుల్లో తీసుకుంటామని ఇచ్చిన హామీ కూటమి ప్రభుత్వ నిలబెట్టుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. సుమారు రాష్ట్రంలో రెండు లక్షల 60 వేల మంది కుటుం బాలతో రోడ్డు మీద పడ్డామని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని మండలాల్లో ఉన్న గ్రామ వాలంటీర్లు ఈ పోరాటానికి సంసిద్ధం కావాలని కోరారు. 26న అన్ని మండలాలలో రిలే నిరాహార దీక్షలు, 27న బిక్షటన, 28న మండల తహసిల్దార్ కార్యాలయాలకు వినతి పత్రాలు ఇవ్వాలని జిల్లా కమిటీ తీర్మానం చేసిందని పేర్కొన్నారు. తమ పోరాటానికి మద్దతు పలకాలని కోరారు.

పెయింటింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అరకులోయ తేజవళి పెయింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏషియన్ పెయింట్స్ కంపెనీ సహకారంతో స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో యువతకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో వివిధ రకాల పెయింటింగ్స్, పుట్టి, రోయల్ ప్లే ఎనామెల్స్ పెయింటింగ్, డెకరేటివ్ కోటింగ్ వంటి వాటిపై శిక్షణ అందించారు. శిక్షణ పొందిన అనంతరం పెయింటర్స్ కు సర్టిఫికెట్స్, గుర్తింపు కార్డులు, టీ షర్ట్స్, బ్యాగ్స్ టోపీలు అందజేశారు.

మదర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి. సబ్బవరం: మదర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని లక్ష్మి ఎంటర్ప్రైజెస్ అధినేత ప్రముఖ పారిశ్రామిక వేత్త, వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు కొనియాడారు. మండల కేంద్రంలోని స్థానిక మదర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వి.సత్యగంగరాజు ఆధ్వర్యంలో నిరుపేదలకు రగ్గులు, చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ, మదర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పది ఏళ్ళుగా మండలంలోనే కాకుండా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టి ఎన్నో సేవా అవార్డులు తీసుకున్నారన్నారు.ట్రస్టు చైర్మన్ సత్య గంగరాజు 6 కోట్లు విలువైన సొంత భూమిని ట్రస్ట్ నిర్మాణం చేసినందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. టైలరింగ్ లో శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు, వృద్ధులకు పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, దెడ్డం పద్మావతి, పల్లా సత్తిబాబు, ట్రస్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జి రమేష్, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రగ్గులు పంపిణీ చేస్తున్న వెంకటరావు

ప్రశాంతంగా సాగునీటి సంఘం ఎన్నికలు

బుచ్చెయ్యపేట మండలం రాజాంలో ఎన్నికైన సభ్యులు

ప్రజాశక్తి-దేవరాపల్లి: కలిగొట్ల బ్రాంచ్ ఛానల్ ఎన్నికలలో కూటమి అభ్యర్థులందరూ ఏకైకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఛానల్ అధ్యక్షుడిగా టిడిపి మద్దతుదారుడు నాయకుడు గురుపోటు చిన్ననాయుడు, వైస్ అధ్యక్షుడిగా తుంపాల అప్పారావు జనసేన పార్టీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా రాయపురెడ్డి రెడ్డి దేవుడు బాబు, రాయపురెడ్డి అప్పలనాయుడు, బండారు సత్తిబాబు, వేచలపు శ్రీనివాసు, రుతల శ్రీరామ్, మూర్తి గొర్రెపోటు వెంకటరావు, దొగ్గ నాయుడు బాబు ఎన్నికయ్యారు.

గొలుగొండ మండలంలో 14 నీటి సంఘాలు టీడీపీ మద్దతుదారులతో ఏకగ్రీవమయ్యాయి. మండలంలోని కొంగసింగి గ్రామ నీటి సంఘం చైర్మన్‌గా కసవరాజు సత్యనారాయణ, వైస్ చైర్మన్ అంబటి వరహాలబాబు, కొత్తమల్లంపేట చైర్మన్‌గా కిల్లాడ సన్యాసినాయుడు, వైస్ చైర్మన్‌గా పాండా రామకృష్ణ, తుపాకి గెడ్డ చైర్మన్‌గా రాయపురెడ్డి నాగేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా లగుడు నాగరాజు, చెలిమయ్య చైర్మన్‌గా రాయపురెడ్డి నర్సింహమూర్తి, వైస్ చైర్మన్‌గా భీమిరెడ్డి మహేశ్వరరావు, చిట్టింపాడె గెడ్డ చైర్మన్‌గా రాయపురెడ్డి చిన్నయ్యనాయుడు, వైస్ చైర్మన్‌గా చిటికెల జోగినాయుడు, ఎరకంపేట చైర్మన్‌గా కూరాకుల రమణ, వైస్ చైర్మన్‌గా గుమ్మడి చిన్నబ్బాయి, విప్పలపాలెం ఆయకట్టు చైర్మన్‌గా గొర్లి సత్యనారాయణ, వైస్ చైర్మన్‌గా నాగేశ్వరరావు, ముంగర్లపాలెం చైర్మన్‌గా వంటాకుల కన్నయ్యనాయుడ, వైస్ చైర్మన్‌గా దుంగల అప్పలనాయుడు ఎన్నికయ్యారు.

ఎస్.రాయవరం:మండలంలో నీటి సంఘం ఎన్నికలు నిర్వహించడం జరిగింది. కూటమి నేతృత్వంలో 18 మంది మద్దతుదారులు నీటి సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నవీన్ రాజు, మాజీ అధ్యక్షులు నల్లపరాజు వెంకటరాజు, వామ్మవం సర్పంచ్ బుజ్జి కోన అప్పలరాజు పాల్గొన్నారు.

కే.కోటపాడు: వి.సంతపాలెం నాగారాయుడు చెరువు గొండు పాలెం సీతమ్మచెరువుకు ఎన్నికలు నిలిపివేశారు. రైవాడ ప్రాజెక్ట్ వారాడ బ్రాంచ్ కెనాల్కు బొడ్డు ఉమాదేవి, మేడిచర్ల ఛానల్‌కు పూడి ప్రకాష్‌రావు, దొంగల నాయుడుపాలెం ఛానల్‌కు కొల్లి స్వామినాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రోలుగుంట:మండలంలోని కొమరవోలు ఆవకు ఆరుగురు డైరెక్టర్లలో పోతల శ్రీనివాసరావు, సామిరెడ్డి క్రాంతి, బోశం సత్యనారాయణపాత్రుడు, కన్నంపేట డైరెక్టర్ దంట్ల సత్యనారాయణ, జగ్గంపేట యాకా పెంటయ్య, తూటిపాల గ్రామానికి చెందిన సుర్ల రాజునాయుడు ఎంపికయ్యారు. వీరిలో చైర్మన్ పోతల శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా దంట్ల సత్యనారాయణను ఎన్నికయ్యారు. కంచుగుమ్మల చైర్మన్‌గా ఎర్రా రాజుబాబు, వైస్ చైర్మన్‌గా కోన రామరాజు, అడ్డసారం తివ్వగెడ్డకు చైర్మన్‌గా తంగేటి ఎరకునాయుడు, వైస్ చైర్మన్‌గా బల్లి లక్ష్మణ్, కొవ్వూరు పోతలవాని ట్యాంకుకు చైర్మన్‌గా మలసాల రమణాజీ, వైస్ చైర్మన్‌గా చందక నూకరాజు, కొవ్వూరు కనుమల చెరకు చైర్మన్‌గా యర్రంశెట్టి బాబూరావు, వైస్ చైర్మన్ యర్రంశెట్టి వాసుదేవరమూర్తి, నిండుగొండ పోతలవాని చెరువుకు చైర్మన్‌గా కాళ్ల వరహాలనాయుడు, వైస్ చైర్మన్‌గా ఇటంశెట్టి బాబూరావు, జె.నాయుడుపాలెం దొర చెరువుకు చైర్మన్‌గా మరిశా రాజు, వైస్ చైర్మన్‌గా మళ్ల శ్రీను, కుసర్లపూడి కైసర్లవాని చెరువుకు చైర్మన్‌గా అనిమిరెడ్డి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా గొల్లు గోవింద, గుండుబాడు గెడ్డకు చైర్మన్‌గా బోర పోతురాజు, వైస్ చైర్మన్‌గా చిన్నోడు ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు.

బుచ్చెయ్యపేట:మండలంలోని పెదపూడిలో శనివారం నిర్వహించిన పెద్ద చెరువు సాగునీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షుడిగా ఉండి తాతారావు, ఉపాధ్యక్షుడిగా కరక గ్రామానికి చెందిన దమ్ము చినబాబు, ప్రాదేశిక సభ్యులుగా ఉప్పిలి సత్తా అప్పారావు, యన్నంశెట్టి నాగరాజు, నక్కా తాతలు,గుర్రం చిన్నకృష్ణలను రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గున్నెంపూడిలో పెద్దేరు కాలువ నీటి సంఘం ఎన్నికలలో కూటమి మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్‌గా సోమిరెడ్డి వెంకట రమణమూర్తినాయుడు, వైస్ చైర్మన్గా అద్దేపల్లి గోవింద, డైరెక్టర్లుగా ముచ్చకర్ల వరహా నాగేశ్వరరావు, కోన తలుపులు నాయుడు, అప్పాన పైడినాయుడు, అక్కిరెడ్డి చినరామ నాయుడు, గుండు గణేష్, సోమిరెడ్డి రాము, అల్లం శ్రీను,వడాల సూర్యనారాయణ,తాటికొండ రాము, గాడి నరసింహమూర్తి ఎన్నికయ్యారు.రాజాం గ్రామంలో సింహాద్రి చెరువుకు అధ్యక్షులుగా కంఠంరెడ్డి తాతారావు, ఉపాధ్యక్షులుగా మరిశా సన్యాసినాయుడు, మెంబర్లుగా నాగఅప్పారావు, అప్పలనాయుడు ఎన్నికయ్యారు.

అమృతవాణి చెరువుకు అధ్యక్షులుగా యన్నంశెట్టి శ్రీను, ఉపాధ్యక్షులుగా పరవాడ రాము ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగులపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ మరిశా సతీష్, మండల టిడిపి రైతు అధ్యక్షులు మరిశా నరేష్, జనసేన గ్రామ అధ్యక్షుడు కోట శేషు, మాజీ సర్పంచ్ సత్యారావు పాల్గొన్నారు.

రోలుగుంటలో....

కొత్తకోట:రావికమతం మండలంలో శనివారం జరిగిన సాగు నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో గొంప సాగు నీటి సంఘం ఎన్నిక మినహా అన్ని సంఘల ఎన్నికలు సజావుగా సాగాయి. కల్యాణపు లోవ జలాశయం సాగు నీటి సంఘం చైర్మన్‌గా దొండపూడి గ్రామానికి చెందిన బంటు రామునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముంత మామిడికట్టు చైర్మన్‌గా కలం నర్సింగ్ రావు, పెదకట్టు చైర్మన్‌గా వద్దాది నర్సింగ్‌రావు, వారకట్టు సాగు నీటి సంఘం చైర్మన్ గా వేపా రామకృష్ణ ఎన్నికయ్యారు. వీరిని రావికమతం మాజీ ఎంపిపి దంగేటి రామకృష్ణతో పాటు పలువురు టిడిపి నాయకులు కోట సత్యన్నారాయణ, ఉగ్గిన శ్రీను, బంటు శ్రీను, సిమ్మాది భాస్కరరావు, గొర్లె కృపారావు, వెల్లంకి ఈశ్వరరావు అభినందించారు.

వడ్డాది:బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో కస్పా కాలువ నీటి సంఘం ఎన్నికలో దొండా రవి శ్రీనివాస్ గెలుపొందారు. వెలుగుల కృష్ణ, దాడి పెద గోవింద, అద్రావు ఈశ్వరరావు, సీతామాణిక్యం, కోవెల లక్ష్మణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో వడ్డాదికి చెందిన దాడి పెద గోవిందను చైర్మన్‌గా చిన్నప్పన్నపాలెంకి చెందిన కోవెల లక్ష్మణమూర్తిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు.

నర్సీపట్నంటౌన్: రావణాపల్లి రిజర్వాయర్, తాండవ ప్రధాన కాలువ సాగునీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. వంటాకుల సత్యనారాయణ, లాలం వెంకటరమణ, మాకిరెడ్డి గౌరీ, రుత్తల రాజేశ్వరరావు, లాలం అప్పలనాయుడు, నాగులపల్లి గోవిందరావు నామినేషన్ దాఖలు చేయగా సింగిల్ నామినేషన్లు వచ్చాయని, దీంతో ఆరుగురిని ఏకగ్రీవం చేసినట్లు తెలియజేశారు. రుత్తల రాజేశ్వరరావు చైర్మన్‌గా నియమితులయ్యారని తెలిపారు.

గొలుగొండ:మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు పలు చోట్ల ఏకగ్రీవమయ్యాయి. మండలంలో 14 నీటి సంఘాలు టీడీపీ మద్దతుదారులతో ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు గొలుగొండ మండలం చీడిగుమ్మల పంచాయతీ ఎరకంపేట గ్రామంల్లో పోలింగ్ కేంద్రాలను నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ సందర్శించారు. ఓటింగ్ విధానంపై అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించాలని ఆదేశించారు.

కోటవురట్ల:మండలంలో ఏడు సాగునీటి కాలువ సంఘ ఎన్నికలు ముగిసాయి. బికే పల్లి ఊటగెడ్డ ఛానల్‌కు అధ్యక్షులుగా సర్ల సన్యాసినాయుడు, ఉపాధ్యక్షులుగా పెట్ల మాణిక్యం, కొడవటిపూడి కోదండరామ ట్యాంక్ అధ్యక్షునిగా మల్లాడి రామలింగేశ్వర గోవిందు, ఉపాధ్యక్షుడిగా కరణం సూరిబాబు, లింగాపురం పెద్ద ట్యాంక్ అధ్యక్షునిగా పోల్నాటి గోవింద్, ఉపాధ్యక్షుడిగా సింగంపల్లి రాంబాబు, కోటవుట్ల ఛానల్ అధ్యక్షునిగా సిద్దాబత్తుల వరహాల బాబు, ఉపాధ్యక్షుడుగా కెవిఎస్ అప్పారావు, గొట్టువాడ గోవాడ ఛానల్ అధ్యక్షునిగా దంతు వేణు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా భీమినేని మాణిక్యాలరావు, చౌడవాడ ఛానల్‌కు అధ్యక్షునిగా కొలగాని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా, అంగిన సత్యనారాయణ, జల్లూరు దుగ్గాడ చానల్‌కు లాలం అప్పలనాయుడు, పెట్ల వెంకటరమణ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

నక్కపల్లి:మండలంలోని 15 చోట్ల సాగునీటి ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. కూటమి నాయకులు, వైసిపి నాయకులు పరస్పర ఒప్పందంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గొడి డిచెర్ల గ్రామంలో మాత్రం ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసుల జోక్యంతో ఇరువర్గాల నేతలు ఒప్పందం మేరకు ఎన్నిక జరిగింది. ఉద్దండపురం లో కూటమి పార్టీ నేతలు, వైసిపి నేతల ఒప్పందం మేరకు మొదటి రెండున్నర సంవత్సరాలు వైసిపి, తర్వాత టిడిపి కి చెందిన నేతలు పదవి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అధ్యక్షులుగా ఇరుబండి సూరిబాబు, ఉపాధ్యక్షులుగా పొడగట్ల సత్య గోవింద్ (టిడిపి) ఎన్నుకున్నారు. గొడిచెర్ల గ్రామంలో రెండు ఆయకట్టు చెరువు ఎన్నికలకు సంబంధించి కూటమి, వైసిపి నేతల మధ్య వాగ్వాదం,ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో తగాదా సద్దుమణిగింది. తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, వైసీపీ నేత వీసం రామకృష్ణ కలిసి ఇరు వర్గాలకు చెందిన నాయకులతో మాట్లాడి ఒక చెరువుకు కూటమి నాయకులు, మరో చెరువుకు వైసిపి వర్గానికి చెందినవారు పదవి చేపట్టాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. బాపిరాజు చెరువుకు టిడిపికి చెందిన వెలగా ఉప్పయ్య అధ్యక్షులుగాను, అల్లు సత్యనారాయణ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. కొత్తచెరువుకు సంబంధించి వైసిపికి చెందిన నల్లల వెంకట సుబ్బారావు అధ్యక్షులుగాను, ఉపాధ్యక్షులుగా రమణను ఎన్నుకున్నారు. కాగిత రాయపు చెరువుకు సంబంధించి ఇరు పార్టీలు నేతలు ఏకగ్రీవమై దేవవరపు అప్పారావు అధ్యక్షులుగాను, దేవవరపు అప్పారావు అనే దివాణం ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో రాజు వెంకటపతిరాజు చెరువు ఎన్నికలో అధ్యక్షులుగా నల్లి వెంకట గోవర్ధనగిరి, ఉపాధ్యక్షులుగా కాళ్ళ బైరాగినాయుడు, పెంట గ్రామంలో గుండమ్మ చెరువుకు సంబంధించి అధ్యక్షులుగా కరిమిరెడ్డి అప్పలనాయుడు, ఉపాధ్యక్షులుగా కొల్లి రామలక్ష్మి, పొట్నూరు గ్రామానికి చెందిన నూకాంబిక చెరువు అధ్యక్షులుగా గొల్ల బజ్జి, ఉపాధ్యక్షులుగా బార్నాల రవి, పాండ్రంగి గ్రామానికి చెందిన కాటమయ్య చెరువుకు సంబంధించి అధ్యక్షులుగా వెన్ని అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా వెన్ని శంకరరావు, కోరాడ గ్రామంలోని కృష్ణంరాజు చెరువు అధ్యక్షులుగా గెద్ద ఎర్రినాయుడు, ఉపాధ్యక్షులుగా పాండురంగ రామకృష్ణ, గంధవరం గ్రామానికి చెందిన నరసింహరాజు చెరువు అధ్యక్షులుగా కొట్టడ అమ్మతల్లి, ఉపాధ్యక్షులుగా తాండ్రంగి వెంకట గణేష్, అదే గ్రామానికి చెందిన కర్రివానిచెరువు అధ్యక్షులుగా గుమ్మడి కాశీ, ఉపాధ్యక్షులుగా తాండ్రంగి సత్యం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయా గ్రామాల ఎన్నికల అధికారులు శనివారం ప్రకటించారు.

దేవరాపల్లిలో...

ఆనందపురం: మండలంలోని గుడిలోవ చానల్ సాగునీటి సంఘం అధ్యక్షులుగా కర్రోతు సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా మరుపల్లి చిన్నయ్య పాత్రుడు, డైరెక్టర్లుగా భూర్లె గణపతిరావు, కొలుసు శ్రీను, పెద్ద రామకృష్ణ, మీసాల రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.శొంఠ్యాం నీటి సంఘం అధ్యక్షులుగా కోరుకొండ వెంకటరావు, ఉపాధ్యక్షులుగా కోరుకొండ రమణ, డైరెక్టర్లుగా కె.అప్పారావు, కె.సన్యాసమ్మ, ఎన్.లక్ష్మి, పి.నర్సిబాబు ఎన్నికయ్యారు. కుసులువాడ నీటి సంఘం అధ్యక్షులుగా రేగాని జగ్గునాయుడు, ఉపాధ్యక్షులుగా ఎన్ని సత్యారావు, డైరెక్టర్లుగా సారికి అప్పలనాయుడు, పడగల అప్పలనాయుడు, బండారు శ్రీనివాసరావు, పడాల సంతోషి ఎన్నికయ్యారు.గంభీరం నీటి సంఘం అధ్యక్షులుగా తెడ్లాపు వెంకటప్పారావు, వైస్ చైర్మన్‌గా ఇల్లిపిల్లి రమణ, డైరెక్టర్‌గా నాగోతు లక్ష్మి ఎన్నికయ్యారు

పెందుర్తి : జివిఎంసి 88వ వార్డు పరిధి సత్తివానిపాలెం రేవళ్ల చెరువు సంఘం అధ్యక్షులుగా ముత్తా అర్జున్, ఉపాధ్యక్షులుగా పాండ్రంకి రమణ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా పాండ్రంకి సత్యరాజు, నెక్కలి ఈశ్వరరావు, ఆళ్ళ సూరిబాబు, ఆళ్ళ అప్పలనాయుడు ఎన్నికయ్యారు.

అనకాపల్లి : అనకాపల్లి మండలంలో తుమ్మపాల, రేబాక, శంకరం, మార్టూరు, బవులవాడ గ్రామాల నీటి సంఘం అధ్యక్షునిగా తుమ్మపాలకు చెందిన పీలా సీతారాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కశింకోట : కశింకోట మండలం నరసాపురం డామ్ సంఘం అధ్యక్షులుగా ఉప్పులూరి అప్పల నాయుడు, ఉగ్గినపాలెం గ్రోయిన్ సంఘం అధ్యక్షులుగా బద్ది గోవింద్, గొబ్బూరు ఛానల్ అధ్యక్షులుగా ఇందల రమణ, కృష్ణంరాజు ఛానల్ అధ్యక్షులుగా పెంటకోట రాము, బయ్యవరం ట్యాంక్ అధ్యక్షులుగా గూడేపు రమ, వెదురుపర్తి గ్రోయిన్ అధ్యక్షులుగా కక్కల రమణ ఎన్నికయ్యారు.

పరవాడ : మండల కేంద్రం పరవాడలోని ఊరచెరువు ఆయకట్టు రైతు సంఘం ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి గొందేరి రమణ తెలిపారు. అధ్యక్షులుగా సిరిపురపు సింహాచలాన్ని రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా డెక్క చెల్లారావు, డైరెక్టర్లుగా చిరికి అప్పలనాయుడు, చుక్క గోపి, పైలా జగదీష్, పైలా అప్పారావు ఎన్నికయ్యారు.

అచ్యుతాపురం : మండలంలో కొండకర్ల ఆవ నీటి సంఘం అధ్యక్షులుగా కాండ్రేగుల జోగినాయుడు, పెదపాడు పురిడి గెడ్డ నీటి సంఘం అధ్యక్షునిగా జనపరెడ్డి సత్యనారాయణ, ఎం జగన్నాధపురం మెలిపాక గెడ్డ సంఘం అధ్యక్షునిగా వీసం సత్యారావు, ఎర్రవరం గొరికివాని గెడ్డ సంఘం అధ్యక్షునిగా గుడేల కనకారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. పురిడి గెడ్డ నీటి సంఘం ఉపాధ్యక్షునిగా కర్రె నాగేశ్వరరావు, డైరెక్టర్‌గా శరగడం ఆదిబాబు, ఆవ నీటి సంఘం డైరెక్టర్‌గా శరగడం రమణబాబు ఎన్నికయ్యారు.

పలు చోట్ల ఘర్షణలు

ప్రజాశక్తి-దేవరాపల్లి: మండలంలోని ఏ.కొత్తపల్లిలో రెడ్డివాని పెద్దవాని చెరువుకు జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో పోలింగ్ కేంద్రం లోపలికి తమని అనుమతించాలంటూ పోలింగ్ కేంద్రం బయట రైతులు ఆందోళన చేపట్టారు.ఎన్నికలు నిర్వహించేందుకు పరిస్థితులు అనుకూలంగా లేనందున ఎన్నికను వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి కె.అప్పారావు ప్రకటించారు. ఈ క్రమంలో ఆయన పోలింగ్ కేంద్రం నుండి బయటకు వస్తుండగా కొందరు రైతులు ఆయనను వెంబడిస్తూ, అడ్డగించే ప్రయత్నం చేశారు. పోలీసుల రక్షణలో ఆయన పోలింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు. కలిగొట్ల కెనాల్ తిమిరాంలో టిసి 2 ఎన్నిక వాయిదా వేశారు. ఉయ్యాల చింతగడ్డ జలాధారువుకు సంబంధించి 12 స్థానాలకు గాను 8వ స్థానం వాయిదా పడింది. ఎం.అలమండలో కొత్త కాలువ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. దేవరాపల్లి అధ్యక్ష ఎన్నిక టిడిపి మద్దతుదారులకు చెందిన రెండు వర్గాల మధ్య ఆఖరి వరకు ఉత్కంఠ పోరు కొనసాగింది.

రావికమతం:మండలంలో నీటి సంఘాల ఎన్నికలు రసాభాసగా సాగాయి. మండలంలో చినపాచిల, మచ్చెపురం ఎర్ర చెరువుకు 12 టీసీలు తెలుగుదేశం మద్దతుదారులు ఎంపిక అయ్యారు. ప్రెసిడెంట్ గా సాసుబిల్లి మాణిక్యం, వైస్ ప్రెసిడెంట్‌గా సాసుబిల్లి కృష్ణారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రావికమతం పెద్దేరు రిజర్వాయర్ ఛానల్ కు సంబంధించి 12 టీసీలు కూటమి మద్దతుదారులు ఏకగ్రీవం అయ్యారు. ప్రెసిడెంటుగా ఆర్ల గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక వాయిదా పడింది .మరుపాక రిజర్వాయర్ కాలువ 12 టీసీలు కూటమి పార్టీ మద్దతుదారులు ఎన్నిక అయ్యారు ప్రెసిడెంటుగా ఈరనాల నాయుడు బాబు, వైస్ ప్రెసిడెంట్‌గా సీతా అప్పారావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుడ్డిప రాబందు ట్యాంకు 6 టీసీలకు సంబంధించి టిడిపి, వైసిపి వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.గుడ్డిప గొర్లగడ్డ బూతులో నలుగురు ఎన్నికయ్యారు.

సబ్బవరం: మండలంలోని నల్ల రేగుల పాలెం గ్రామానికి చెందిన విజయరామరాజు సాగర్ చెరువు సాగునీటి సంఘం ఎన్నిక రసాభాసాగా జరిగింది. కూటమి, వైసీపీ నేతల మధ్య ఏకగ్రీవానికి ఒప్పందం కుదరకపోవడంతో రసాభాగా జరిగాయి. కూటమి పార్టీ కి ముగ్గురు, వైసీపీ కి ముగ్గురు ఉండగా అధ్యక్ష పదవి తమకు కావాలని ఇరు పార్టీల మధ్య వాగ్వాదం నెలకొంది. అధ్యక్ష పదవిని కూటమి నేతలు, ఉపాధ్యక్ష పదవిని వైసీపీ నేతలు క్రైవశం చేసుకున్నారు.అధ్యక్షులుగా కూటమికి చెందిన కాయిత రమణ, ఉపాధ్యక్షులుగా వైసీపీకి చెందిన బొట్ట సింహాద్రి లు ఎన్నికయ్యారు.

రావికమతం మండలం గుడ్డిపలో ఆందోళనకు దిగిన రైతులు

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రీ పోలింగ్ నిర్వహించాలి

ప్రజాశక్తి-సబ్బవరం: మండలంలోని మొగలిపురం నేరెళ్ల చెరువు సాగు నీటి సంఘానికి రీ పోలింగ్ నిర్వహించాలని నేరెళ్ల చెరువు ఆయకట్ట రైతులు, పెందుర్తి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు గండి రవికుమార్ కోరారు. ఈ మేరకు ఆయన సబ్బవరం తహసిల్దార్, సాగునీటి సంఘ ఎన్నికల అధికారి కార్యాలయ సిబ్బంది కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడం పై తమకు, ఆయకట్టు రైతులకు గాని ఎటువంటి సమాచారం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. తాము ఎన్నికల అధికారిని, విఆర్ఓ ను ఈ విషయమై అడిగితే వారు ఎటువంటి సమాధానం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి సంఘం ఎన్నిక ఓటర్ లిస్ట్ ని సచివాలయంలో ప్రదర్శించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నేరెళ్లచెరువు ఆయకట్టు రైతులకు మళ్లీ సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల యువజన విభాగం అధ్యక్షుడు ఎర్ల నాయుడు, బాబు, వార్డ్ మెంబెర్ లు అప్పికొండ సత్యనారాయణ , గండి నాయుడు ,గండి రవికుమార్ యువ సైన్యం పాల్గొన్నారు.

బంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెట్రోల్ బంక్ ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం:మండలంలోని సబ్బవరం-చోడవరం రోడ్డులో లా యూనివర్సిటీ దగ్గరలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎసంజయ్ అసోసియేట్స్ వారి నయారా ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ బంక్)ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సబ్బవరం ప్రాంత ప్రజలకు ఈ పెట్రోల్ బంక్ ఉపయోగపడుతుందన్నారు. ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవెర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గండి బాబ్జి పాల్గొని పెట్రోల్ బంక్ యజమాని గొంప నాయనప్పను అభినందించారు. లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ అధినేత చొక్కాకుల వెంకటరావు పెట్రోల్ బంకు యజమాని గొంప నాయనప్ప ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సూర్య మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ అధినేత బాదిరెడ్డి లక్ష్మణ, సర్పంచ్ డి.ప్రసాదరావు, ఎంపీటీసీ గొర్లి కృష్ణ చైతన్య, టి. శేఖర్, బంతికోళ్ల పద్మ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 22న సామూహిక వివాహాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ పాత నగరం వుడ్ యార్డ్ స్ట్రీట్‌లోగల శ్రీ వాసవి కళ్యాణ మండప సంఘం వారి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22న ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు కళ్యాణ మండప సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విస్సకోట రామమూర్తి, కందుల మూర్తి తెలిపారు. శనివారం సామూహిక ఉచిత వివాహాలకు సంబంధించిన పోస్టర్‌ను, కరపత్రాలను విడుదల చేశారు. కుటుంబాల్లో పెద్దల అభీష్టం మేరకు ఈ సామూహిక వివాహాలు జరుపుతామని, వివరాలకు 9296652047 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. సంఘ గౌరవ అధ్యక్షులు వీరభద్రరావు, కోశాధికారి యలమర్తి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

పార్టీ జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: ఈ నెల 20 నుండి 22 వరకు నర్సీపట్నంలో జరగనున్న సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె లోకనాథం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు శనివారం ప్రచారం చేపట్టారు. లోకనాథం మాట్లాడుతూ, పెరుగుతున్న విద్యుత్ చార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ నెల 21న జరుగుతున్న బహిరంగ సభకు హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ బహిరంగ సభకు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వర్లు హాజరు కానున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి, నాగిరెడ్డి సత్యనారాయణ, శివ, కన్నబాబు పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ఘనంగా చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీ లీల, చిత్రంలో పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్

అభిమానులకు అభివాదం చేస్తున్న హీరోయిన్ శ్రీ లీల

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని ప్రముఖ వాణిజ్య కేంద్రం డాబా గార్డెన్స్‌లో చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ప్రముఖ సినీ తార శ్రీ లీల సందడి వాతావరణం నడుమ ప్రారంభించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్తగా షాపింగ్ మాల్స్ ఏర్పాటు కావడం వల్ల యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. షాపింగ్ మాల్స్, పరిశ్రమలు రాష్ట్రంలో ఎన్నో రావలసి ఉందన్నారు. ఇటువంటివి ఏర్పాటు కావడానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, అది తమ పాలసీ అని చెప్పారు. ఇటువంటివి నిర్వహించుకోవడానికి ఎటువంటి అవరోధాలూ లేకుండా చూస్తామని, వ్యాపార సంస్థలను ఇబ్బందులకు గురి చేసేది లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ అధునాతన కలెక్షన్లతో, ప్రజలందరినీ ఆకర్షించే విధంగా చెన్నయ్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించడం హర్షించదగిన విషయమన్నారు. సినీ తార శ్రీలీల మాట్లాడుతూ అన్ని తరగతుల ప్రజల అభిరుచికి తగ్గట్టుగా వస్త్రాలు అందిస్తున్న చెన్నయ్ షాపింగ్ మాల్‌లో అందరికీ అందుబాటు ధరలలో వస్త్రాలు లభిస్తాయని చెప్పారు. కంచి, ధర్మవరం పట్టు వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విశాఖ వంటి ప్రశాంత నగరంలో చెన్నయ్ షాపింగ్ మాల్ ఏర్పాటు కావడం, దానిని తన చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో షాపింగ్ మాల్ మేనేజింగ్ డైరెక్టర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం షాపింగ్ మాల్ వెలుపల ఏర్పాటు చేసిన వేదికపైకి సినీ తార శ్రీలీల వచ్చి కొంతసేపు సందడి చేశారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావడంతో డాబా గార్డెన్స్ మెయిన్ రోడ్డు కిక్కిరిసిపోయింది. ట్రాఫిక్‌ను వివిధ మార్గాల వైపు పోలీసులు మళ్లించారు.

'సెయింట్ ఆంథోనీ' పూర్వ విద్యార్థుల సందడి

సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని మహారాణిపేటలో గుర్తింపు పొందిన సెయింట్ ఆంథోనీ పాఠశాల ఆవరణలో శనివారం పూర్వ విద్యార్థుల సందడి చేశారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన 1984 బ్యాచ్ విద్యార్థులు రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుపుతున్నారు. శనివారం ఉదయం 40 ఏళ్ల స్నేహం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రచురించిన సావనీర్‌ను పూర్వ ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డివి.చలం మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో గడిచిన రెండు దశాబ్దాలలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు. పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు కె.చంద్రశేఖరం, రాధాప్రసాదరావు, మరియాదాస్, జోజిబాబు, డి.కొండలరావు, ప్రసాదరావు తదితరులు మాట్లాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో నాలుగు సెక్షన్ల విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్.శివ శంకర్, కె.గురునాథరావు, విక్రమాదిత్యవర్మ, ఆనంద్, రత్నకుమార్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు 40 ఏళ్ల స్నేహం కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణ పరిశీలనకు..

17, 18 తేదీల్లో ఏకసభ్య కమిషన్ రాక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోని ఎస్‌సి వర్గీకరణను పరిశీలించేందుకు నియమించబడిన ఏక సభ్య కమిషన్ బృందం ఈ నెల 17, 18 తేదీల్లో విశాఖపట్నం జిల్లాలో పర్యటించనుందని, జిల్లా యంత్రాంగంతో పాటు వివిధ ఉప కులాల సభ్యుల సంఘాలతో సమావేశమై వినతి పత్రాలు స్వీకరించనుందని విశాఖపట్నం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిషన్ సభ్యులుగా విశ్రాంత ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజాన్ మిశ్రాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా నియమించిందని పేర్కొన్నారు. ఈ ఏకసభ్య కమిషన్ జిల్లాలోని షెడ్యూల్ కులాలకు సంబంధించిన వ్యక్తులు, సంఘాలు, సంస్థల నుంచి వినతి పత్రాలు స్వీకరించి, పరిశీలన చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని వెల్లడించారు. అంతేకాకుండా రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో, విద్యాసంస్థల్లో, షెడ్యూల్ కులాల ఉపవర్గాల ప్రాతినిధ్యం, షెడ్యూల్ కులాలలోని వివిధ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ విద్యాపరంగా ఉన్న వెనుకబాటును పరిశీలించనుందని తెలిపారు. ఈ క్రమంలో కమిషన్‌కు సమస్యలను నివేదించే వ్యక్తులు లేదా సంస్థలు తమ వినతి పత్రాలను సంబంధిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో డిసెంబర్ 18 ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలలోపు కలెక్టర్ కార్యాలయంలో అందజేసేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు.

నూతన జిల్లా కమిటీ సభ్యులతో రామ్మోహన్

విద్యార్థులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

ప్రజాశక్తి - యలమంచిలి : గత ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. పట్టణంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ మూడో జిల్లా మహాసభలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో విద్యారంగ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ యువగళం సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

పలు అంశాలపై తీర్మానాలు

విద్యా దీవెన, విద్యా వసతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు సమకూర్చాలని, మెస్ ఛార్జీలు పెంచాలని మహాసభలో తీర్మానాలు చేశారు.

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బాలాజీ, రమణ ఎన్నిక

ఎస్ఎఫ్ఐ అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.బాలాజీ, ఎం.రమణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గౌతం కుమార్, సహాయ కార్యదర్శులుగా ఎ.అభి, పి.కృపానంద్, జిల్లా కమిటీ సభ్యులుగా జనార్దన్, విజయ్, నూకరాజు, వెంకటి, నాగేష్‌లు ఎన్నికయ్యారు. జిల్లా నలుమూలల నుంచి 150 మంది ప్రతినిధులు ఈ మహాసభకు తరలివచ్చారు.